
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 23 డిసెంబరు 2022

5



వ్యవసాయ కూలీలపై తేనెటీగల దాడి

ముగ్గురికి గాయాలు

కుక్కునూరు: వ్యవసాయ కూలీలపై తేనెటీగలు దాడి చేసిన ఘటనలో 15 మంది గాయాలపాలయ్యారు. గురువారం దామరచర్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు గ్రామంలోని ఓ రైతు పత్తి చేలో పత్తి తీస్తుండగా అకస్మాత్తుగా తేనె టీగలు వారిపై దాడిచేశాయి. దీంతో కూలీలంతా భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో 12 మందికి స్వల్ప గాయాలు, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో బల్లెం వీరమ్మ, మొరంపల్లి కుమారి, ఎల్.కృపావతి ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం అమరవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన కూలీలను వ్యవ సాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.శ్రీను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు అనంత కుమార్‌ను కోరారు.


మళ్లీ కరోనా కలవరం..!

బిఎఫ్-7 ఒమిక్రాన్ వైరస్ విస్తరణపై ప్రభుత్వం అప్రమత్తం

రోజుకు పరీక్షలు 500కు పెంచిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ

ఇప్పటి వరకూ జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నిల్

గత స్మృతులతో జిల్లావాసులు బెంబేలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరోనా కలవరం మళ్లీ మొదలైంది. బిఫ్-7 ఒమిక్రాన్ వైరస్ హెచ్చరికలతో జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. దీనిపై కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ రెండు జిల్లాలవ్యాప్తంగా కరోనా కేసులు నమోదు కాలేదు. కరోనా హెచ్చరికల నేపథ్యంలో పరీక్షల సంఖ్యను జిల్లా వైద్యఆరోగ్యశాఖ పెంచింది. మొన్నటి వరకూ ఎవరైనా జ్వర బాధితులు సంప్రదిస్తేనే కరోనా టెస్టులు చేసేవారు. ఇప్పుడు అలాకాకుండా అనుమానితులకు తప్పనిసరిగా టెస్టులు చేస్తున్నారు. గడిచిన రెండురోజులుగా ఏలూరు జిల్లాలో రోజుకు 500 వరకూ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వైద్యఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. మళ్లీ కరోనా హెచ్చరికలు జనంలో చర్చనీయాంశంగా మారాయి. గత రెండు దశల్లో కరోనా నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనలు గుర్తు చేసుకుని జనం ఆందోళన చెందుతున్నారు. 2020 మార్చిలో మొదటి దశ కరోనా ప్రారంభమవ్వగా 2021 ఏప్రిల్‌లో రెండో దశ కరోనా విజృంభించింది. రెండు దశల్లోనూ జిల్లావ్యాప్తంగా 1,79,788 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా విలయతాండవంతో జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బెడ్స్ దొరక్క, సరైన వైద్యం అందక, ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీని భరించలేక జనం నలిగిపోయారు. కరోనా బారిన పడి అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,121 మంది మృతి చెందినట్లు ప్రకటించారు. అయితే ఆ లెక్కలన్నీ వాస్తవం కాదని తేలిపోయింది. కరోనాతో మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్స్‌గ్రేషియాకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 5,300 వరకూ ఉంది. కరోనా సోకి 14 రోజుల్లోపు మృతి చెందిన వారి కుటుంబాలను మాత్రమే ఎక్స్‌గ్రేషియాకు అర్హతగా తీసుకున్నారు. కరోనా తగ్గి 14 రోజుల తర్వాత డిశ్చార్జి అయ్యి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా అనేక మంది మృతి చెందారు. ఇటువంటి మరణాలను సైతం లెక్కిస్తే మృతుల సంఖ్య ఆరు వేలుపైనే ఉంటుందని అంచనా. కరోనాతో అప్పట్లో ఎదుర్కొన్న ఇబ్బందులను అంతా గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ కరోనా హెచ్చరికల నేపథ్యంలో సర్వత్రా ఆందోళన నెలకొంది. జిల్లాలో దాదాపు అందరికీ రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తయ్యింది. జనాల్లో ఇది కొంత ధైర్యాన్ని నింపుతోంది. కరోనా హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సైతం అప్రమత్తమైంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కొనసాగుతుండటంతో గ్రామాల్లో అనుమానితులు ఉంటే వెంటనే కరోనా పరీక్షలు నిర్వహించి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కోవిడ్ పాజిటివ్ వస్తే ఐసోలేషన్‌లో ఉంచడం, ఇతర దేశాల నుంచి వచ్చిన వారికి టెస్టులు నిర్వహించడం, కోవిడ్ ప్రొటోకాల్ కొనసాగించడం, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడం వంటివి చేయాలని ప్రభుత్వం నుంచి వైద్యఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు అందాయి.

పండుగ సీజన్లలో అప్రమత్తతే కీలకం

రానున్న నెల రోజుల వ్యవధిలో ముఖ్యమైన వేడుకలు జరగనున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, జనవరిలో సంక్రాంతి పండుగ జరగనుంది. ఈ వేడుకల్లో పెద్దఎత్తున జనం ఒకచోట చేరనున్నారు. సంక్రాంతికి విదేశాలు, వివిధ రాష్ట్రాల్లో ఉన్నవారంతా సొంతూళ్లకు రానున్నారు. దీంతో కరోనా విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వేడుకల సమయంలో జనం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జ్వరంతో ఇబ్బంది పడితే వెంటనే వైద్యులను కలవాలని, సొంత వైద్యం వద్దని చెబుతున్నారు. కొత్త ఒమిక్రాన్ వేరియంట్ విస్తరిస్తున్న నేపథ్యంలో జనంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం సైతం ప్రభుత్వంపై ఉంది.

ఎస్‌సి, ఎస్‌టి కేసులను సమన్వయంతో పరిష్కరించాలి


ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, ఇందుకు రెవెన్యూ, పోలీస్, సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సమావేశం ఆర్‌డిఒ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల సమస్యల పరిష్కారానికి గ్రామాల వారీగా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామాల కూడళ్లలో ఎస్‌సి, ఎస్‌టి కేసులకు సంబంధించిన హోర్డింగ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కుల ధృవీకరణ పత్రాల జారీలో సమస్యలు, ఛార్జిషీటు ఫైల్, నష్టపరిహారం తదితర అంశాలపై కమిటీ సూచనలు చర్చించారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన తర్వాత అధికారులతో పాటు ఆ కాపీని కమిటీ సభ్యులకూ పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సమావేశంలో ఏలూరు తహశీల్దారు సోమశేఖర్, ఎంపిడిఒ ప్రవీణ, ఎఎస్‌డబ్ల్యూఒలు బివి.రత్నం, ఎన్‌ఎ మంగతాయారు, కె.త్రిమూర్తులు, కమిటీ సభ్యులు మేదర అజేయ్‌బాబు, అప్పారావు, డి.అబ్రహం, ఎఎస్‌ఐ ఎ.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ దేవికదేవి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు, నాయకులు

గిరిజనుల సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో గిరిజనులు, పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ గురువారం ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ పోరాటాలలో ఆదివాసీలు, పేదలు, దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శిక్షణ తరగతులు ఈనెల 27, 28 తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతాయన్నారు. ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంద మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఈ తరగతులను జయప్రదం చేయాలని కోరారు.

నిర్వాసితుల ఇంటి పరిహారపు జాబితాలో

అభ్యంతరాలుంటే సరిచేసుకోండి



అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న 41.15 కాంటూరులోని మొదటివిడత ముంపులో ఉన్న నిర్వాసితుల ఇంటి విలువల పరిహారపు జాబితాలో అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవాలని, సమస్యలు పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎన్.రంగలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన 'ఎ' బ్లాక్ ఇంటి పరిహారపు విలువల జాబితాను ప్రకటించి అభ్యంతరాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగలక్ష్మి మాట్లాడుతూ రెండు నెలల క్రితం ప్రత్యేక బృందంతో పోలవరం ప్రాజెక్టు వల్ల మొదటి విడత ముంపులో ఉన్న కుక్కునూరు 'ఎ' బ్లాక్‌లో ఇంటింటికీ తిరిగి ఇంట్లో ఉన్న చెట్లు, మొక్కలు, మరుగుదొడ్లు, స్థలంతోపాటు ఇంటి విలువల సర్వే నిర్వహించామన్నారు. అనంతరం గ్రామసభలో తుది జాబితాను ప్రకటించి అభ్యంతరాలపై నిర్వాసితులు దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హత కల్గిన ప్రతి నిర్వాసితుడికీ న్యాయం చేస్తామన్నారు. ఈ గ్రామ సభలో ఎస్‌డిసి ఏలూరు కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టి.వీరాస్వామి, కుక్కునూరు పంచాయతీ సర్పంచిరావు, మీనా, విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నిర్వాసితులు వై.నాగేంద్రరావు, రావు వినోద్, వెంకన్నబాబు, నాగులమీరా, ఎం.సత్యనారాయణ, వి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫుడ్‌ఫ్యాట్స్ ప్రమాదంలో..

కాలి బూడిదైన కార్మికుడు

భోరుమన్న కుటుంబ సభ్యులు, కార్మికులు

రూ.50 లక్షలు పరిహారమిచ్చేందుకు యాజమాన్యం అంగీకారం

ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి : సిఐటియు

ఘటనా స్థలిని సందర్శించిన డిప్యూటీ సిఎం కొట్టు, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంతా భయపడినట్లే అయ్యింది. తాడేపల్లిగూడెం పట్టణ శివారులో పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ పరిశ్రమలోని ఎస్‌ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఆచూకీ తెలియని కార్మికుడు ఆ మంటల్లోనే కాలి బూడిదైనట్లు గురువారం ఉదయం గుర్తించారు. ప్లాంట్‌లో నిపుణుల పర్యవేక్షణలో అధికారులు గాలింపు చేపట్టగా ఇనుప శిథిలాల కింద కాలి బూడిదైన కార్మికుడు గుడిగంట్ల మల్లికార్జునరావు అలియాస్ మల్లి (38) మృతదేహ అవశేషాలను గుర్తించారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన మృతునికి భార్య రామతులసి, కుమార్తెలు పావని, అక్షయ ఉన్నారు.



మల్లికార్జునరావు మృతదేహం

ఫ్యాక్టరీ వద్ద మృతుని కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మల్లికార్జునరావు మృతి చెందాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో యాజమాన్యం, కార్మిక సంఘాల నేతల మధ్య చర్చలు సాగాయి. మృతుడు మల్లికార్జునరావు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, భార్యకు ఉద్యోగం ఇస్తామని, పిల్లల ఉన్నత చదువుకు సహకరిస్తామని యాజమాన్యం అంగీకరించింది. ఈ చర్చల్లో భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ శేషగిరి, పరిశ్రమ యజమాని ఒపి.గోయెంకా, ప్రతినిధులు జనార్ధన్, కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కె.రామకృష్ణ, ఫుడ్‌ఫ్యాట్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎఫ్‌ఐటియు నేతలు మూర్తి, భాస్కర్‌రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంఘటనా స్థలాన్ని ఫోరెన్సిక్ అండ్ సైంటిఫిక్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ సురేష్ సందర్శించారు. ప్లాంట్ డిజిఎం సి హెచ్.శాస్త్రిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ ప్రశాంతి ప్రమాద స్థలిని సందర్శించి యాజమాన్య ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గాయాలతో రాజమండ్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని యజమాన్యాన్ని కొట్టు సత్యనారాయణ ఆదేశించారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

భీమవరం : ప్రతిపాడులోని ఫుడ్‌ఫ్యాట్స్ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి తక్షణం పరిహారం చెల్లించడంతోపాటు అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించి వారిని అన్ని విధాలా ఆదుకుని, నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు జరగడం కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్రంగా గాయపడటం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీల్లో ప్రభుత్వ పర్యవేక్షణ పెరగాలని, భద్రతా చర్యల్లో లోపాలు జరగకుండా చూడాలని కోరారు. కార్మికుల ప్రాణాలు, భద్రత పట్ల అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలు పునరావతం కాకుండా చూడాలని బలరాం విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

కార్మికులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలి : సిఐటియు

భీమవరం : పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్‌ఫ్యాట్స్‌లో చోటుచేసుకున్న ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కారణాలు వెలికి తీయాలని, ఈ ప్రమాదంలో బాధితులైన కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్ని ప్రమాద ఘటన చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమల్లో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ సరైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ఇలాంటి ఘటనల పట్ల కఠినంగా వ్యవహరించకపోవడం దారుణమన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు, చట్టాలు అమలు చేయని పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ర్యాలీ చేస్తున్న ఆక్వా ఉద్యోగుల సంఘం నాయకులు

ఆక్వా ఉత్పత్తులు ఆరోగ్యదాయకం

చేపలు, రొయ్యల వినియోగం పెంచాలని ఏలూరులో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని మరింత పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, తద్వారా పౌషకార లోపాలు నివారించడంతో పాటు, ఆ రంగంపై ఆధారపడి ఉన్న లక్షలాదిమంది జీవనోపాధి కల్పించినట్లు అవుతుందని ఆక్వా ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు వి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆక్వా ఉద్యోగుల అసోషియేషన్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా చేపలు, రొయ్యలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి సుమారు 80 మంది ఉద్యోగులతో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఫైర్ స్టేషన్, కొత్త బస్టాండ్ మీదుగా సత్రంపాడు వరకూ విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చేపలు, రొయ్యల్లో 22 నుంచి 80 శాతం వరకూ ప్రొటీన్స్, అనేక పోషకాలున్నాయని, అలాగే తేలికగా జీర్ణమయ్యే ఆహారం కావడంతో జీర్ణసంబంధ సమస్యలు రావన్నారు. 2021 శతాబ్దంలో పౌష్టికాహార లోపాలను నివారించగల ఏకైక ఆహారం చేపలు, రొయ్యలు, ఇతర ఆక్వా ఉత్పత్తులేనని గ్రహించాలన్నారు. ఆక్వా నిపుణులు, ఎంజి ప్రతినిధి షోకాత్ అలీ మాట్లాడుతూ.. అమెరికా వంటి దేశాలు భారత దేశ రొయ్య ఉత్పత్తుల దిగుమతులు తగ్గించిందని, పొరుగు రాష్ట్రాల్లో చేపల ఉత్పత్తుల పెంపకం పెరగడంతో ఇక్కడి ఆక్వా ఉత్పత్తులకు గిరాకీ తగ్గిందన్నారు. దీంతో ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుందని, ఆధారపడ్డ రైతులు, టెక్నీషియన్లు, డీలర్లు, ట్రెడర్స్, ఇతర వర్గాలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని చేపలు, రొయ్యల వినియోగం పెంచడానికి ప్రతిఒక్కరు కృలుషిచేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు శేషాసాయి, సెక్రటరీ వెంకట్ మాట్లాడుతూ చేపలు, రొయ్యలు ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిధర్ కుమార్, శ్యామ్, రాజు, వంశీ, డి.నానిబాబు, కుమార్ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

మహిళలపై దాడులు అరికట్టాలని కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలపై, బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని కోరుతూ ఐద్వా, జెవివి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పవర్‌పేటలోని ఐద్వా జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక సమతా రాష్ట్ర కన్వీనర్ తేజశ్రీ, ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ దేశంలో మహిళలపై, బాలికలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంట్‌లో ప్రభుత్వం చెప్పిన గణాంకాలు పరిశీలిస్తే, మన రాష్ట్రమే మొదటిస్థానంలో ఉండటం దారుణమన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ దాడులు పెరిగాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే మహిళలతో ప్రజాఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వెంకటరమణ, రాజ్యలక్ష్మి, సుకన్య, స్వర్ణలత పాల్గొన్నారు.

మూడేళ్లలో పది వేల కేజీల గంజాయి స్వాధీనం

జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి/జంగారెడ్డిగూడెం

జిల్లాలో గడిచిన మూడేళ్లలో నమోదైన 76 గంజాయి కేసుల్లో సుమారు 10 వేల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్‌పి రాహూల్ దేవ్ శర్మ తెలిపారు. గురువారం జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో ఎస్‌పి మాట్లాడారు. జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేళ్ల కాలంలో ఏడు కేసుల్లో 1430 కేజీలు, జీలుగుమిల్లి పరిధిలో నమోదైన ఏడు కేసుల్లో 2840 కేజీల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని గంజాయిని తూకం వేయగా ఐదు శాతం బరువు తగ్గినట్లు గుర్తించామని తెలిపారు. గంజాయిలో తేమ శాతం తగ్గి బరువులో తేడా వచ్చిందన్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని, ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం గంజాయిని డిఐజి ఆదేశాల మేరకు త్వరలో దహనం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐబి అడిషనల్ ఎస్‌పి నక్కా సూర్యచంద్రం, జంగారెడ్డిగూడెం, పోలవరం డిఎస్‌పిలు సత్యనారాయణమూర్తి, లతా కుమారి, సిఐలు వెంకటేశ్వరావు, సత్యనారాయణ, ఎస్‌ఐ వి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. వేలేరుపాడులోని ఆటో యూనియన్ ప్రాంగణంలో మహాసభ గోడపత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఈ మహాసభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శ్రీను, గెడ్డం మల్లేశ్వరరావు, మజ్జి శ్రీను, వాదం సతీష్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానికంగా వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఈ సభకు మండలం లోని స్కీం వర్కర్లు, బిల్డింగ్, ఆటో కార్మికులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.రాజు, జయరాజు, మణికల మంగరాజు, అల్లూరి మోహన్ కృష్ణారెడ్డి, రామచంద్రరావు, రాంబాబు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో..



నూజివీడులో..

నూజివీడు: భీమవరంలో వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నూజివీడు సిఐటియు నాయకులు, కార్యకర్తలు గోడప్రతులను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రాజు, కొండలు, రవి, అశోక్ రాజు, మౌలాలి పాల్గొన్నారు.


వైసిపి హయాంలో విద్యావ్యవస్థ బలోపేతం

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో ఎంఎల్‌ఎలు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, బాలరాజు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. గురువారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష, వైసిపి గ్రామ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు, మండల మహిళా అధ్యక్షురాలు సృజన పావనజ్యోతి, ఎంపిటిసిలు, సర్పంచులు, ఛైర్‌పర్సన్‌లు, ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: విద్యా వ్యవస్థలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది సిఎం జగన్ మాత్రమేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం జెడ్‌పి హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతమైందన్నారు. మండలంలోని 18 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 774 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, 97 మంది ఉపాధ్యాయులకు కలిపి 811 ట్యాబ్‌లను ఎంఎల్‌ఎ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, వైస్‌ఎంపిపి గుగ్గులోతు మహనరావు, సర్పంచి వెంకాయమ్మ, ఎంపిటిసి తెల్లం రమణ, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్

కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ బిల్లు తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ప్రజాశక్తి - దెందులూరు

ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఏదో ఒక సందర్భంలో వినియోగదారుడై ఉన్నాడని, చిన్న పెన్సిల్ దగ్గర నుండి ఏ వస్తువు కొనుగోలు చేసినా రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, అలాగే కొన్నింటిపై కాలాతీతమైన తేదీలుంటాయని వాటిని గమనించి వస్తువులను తీసుకోవాలని చెప్పారు. మనం ఖరీదు చేసిన వస్తువులపై ఏ విధమైన నష్టం జరిగినా పరిహారం కోసం జిల్లా వినియోగదారుల సంఘాన్ని ఆశ్రయించొచ్చని, వినియోగదారుల సంఘంలో కాగితంపై స్పష్టంగా విషయాన్ని తెలియజేసి వారికి అర్జీ పెట్టుకున్న సంబంధిత వ్యక్తులకు లేదా సంస్థలకు నోటీసు ఇవ్వడం ద్వారా వాళ్ల పిలిపించి తగిన నష్ట పరిహారాన్ని చెల్లించే విధంగా తీర్పు వస్తుందని తెలిపారు. డబ్బు పెట్టి కొన్న ఏ వస్తువుకైనా, ఏ సర్వీసుకైనా ఈ చట్టం వర్తిస్తుందని తెలిపారు. న్యాయ సహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గానీ, దగ్గరలోని మండల న్యాయ సేవాధికార సంస్థను కానీ సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు కట్టా సత్యనారాయణ, కూన కృష్ణారావు, సిఎపిస్, ఎ.శిరీష, బి.పెదబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో గోనెసంచులు

ప్రజాశక్తి - చింతలపూడి

రైతులకు సరిపడు గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అవసరమైన గోనె సంచులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు శ్రీనివాస్ రామానుజన్

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి విద్యార్థి శ్రీనివాస్ రామానుజన్ వలె గొప్ప శాస్త్రవేత్త కావాలని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు రత్నమాల, నాగేశ్వరరావు, బాబూరావులు గణిత శాస్త్రంతో కూడిన సైన్సు పార్కు నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సుకు మార్, అల్లాభిక్షు, రంగారావు, యువరాజు, రత్నమాల, నాగేశ్వరరావు, బాబూరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : నేటి విద్యార్థులందరూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి అన్నారు. స్థానిక విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అరుణ, మహాలక్ష్మి, వరలక్ష్మి, లావణ్య, అనూష, కల్యాణి పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి పట్టణంలో చైతన్య టెక్నో పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ 135వ జయంతి సందర్భంగా విద్యార్థులు గణిత నమోనాలను తయారుచేసి ప్రదర్శించారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ, డీన్ మధుబాబు పాల్గొన్నారు.

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడారు. రామానుజన్ చిన్న వయసులోనే గణితంలో ప్రకృతి సిద్ధమైన ప్రతిభ కనపరిచేవాడన్నారు. ఈ కార్యక్రమంలో

ఘనంగా గణిత దినోత్సవం



ముసునూరులో...

వైస్ ప్రిన్సిపల్ ఎ.కె.జె.నరేంద్రకుమార్, గణిత శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ డి.దేవానందం, ఆంగ్ల శాఖధిపతి బి.శ్రీనివాస రావు, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ అసిం, సీనియర్ అధ్యాపకురాలు ఎస్.మణిమాల పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం : స్థానిక ప్రతిభ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు రామానుజన్ నెంబర్ 1729 ఆకారంలో ఒదిగిన విన్యాసాలతో కనువిందు చేశారు. గణితానికి సంబంధించిన పలు రకాల ఫార్ములాలు ఈక్వే షన్స్ ప్రదర్శించారు. పాటలు నృత్యాలు, ఉపన్యాసాలతో రా మానుజన్ గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి, ప్రిన్సిపల్ సరోజారెడ్డి పాల్గొన్నారు.

చాట్రాయి : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజాన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కేశవరెడ్డి మాట్లాడుతూ గణితం మానవుని జీవితంలో నిత్యం ఉపయోగపడుతుందన్నారు. కష్టపడి నేర్చుకుంటే గణితం సులభంగా అర్థమవుతుందన్నారు. గణిత ఉపాధ్యాయుని ఎస్.నీలిమ మాట్లాడుతూ పేదరికంలో పుట్టి పెరిగి తన మేదస్సుతో, పట్టుదలతో, కృషితో గణిత సిద్ధాంతాలను రూపొందించారని, ఎన్నో సిద్ధాంతాలకు పరిష్కారం చూపించిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. అనంతరం గణిత క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రత్తయ్య, ఎస్.నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు : జాతీయ గణిత దినోత్సవాన్ని ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎస్.శ్రీనివాస్ విఐటి అమరావతి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆర్‌జియుకెటి నూజివీడు గణిత విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ బండారి యాదవ్ రూపొందించిన code praxis.engineering math.online వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. చివరిగా గణిత విభాగం నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, డీన్ అకాడమిక్, డాక్టర్ గౌతమి, హెచ్‌ఒడి, మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక పడమర వీధిలో ఉన్న లిటిల్ బర్డ్స్ కాన్వెంట్‌లో మ్యాథమెటిక్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు శ్రీనివాస రామానుజన్ గురించి వేసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల అధ్యాపకులు కిషోర్, ఎం.శ్రీనివాస్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలోని గౌతమ్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీనియర్ ఉపాధ్యాయులు కెవి.సుబ్బారావు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మదన్‌కిషోర్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలను అమర్చిన వారితో కొత్తపల్లి సీత, కోనేరు సత్య ప్రసాద్

వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందించడంతో పాటు అనాధ పిల్లలకు సువిశాలమైన ప్రాంగణంలో ఉచితంగా విద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ఎంతో అభినందనీయమని అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు కొత్తపల్లి సీత అన్నారు. ఆగిరిపల్లి మండల పరిధిలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో ఉన్న ఎలిజబెత్ లెగసీ ఆఫ్ హోప్ కేంద్రం వద్ద పలు జిల్లాలకు చెందిన ముగ్గురు వికలాంగులకు ఆమె గురువారం కృత్రిమ అవయవాలను అందించారు. ఈ సందర్భంగా కోల్ ఇండియా విశ్రాంత జనరల్ మేనేజర్ ఎస్.చంద్రమౌళి మాట్లాడుతూ వికలాంగులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో తమ జీవనాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సిఇఒ. కూరపాటి అజయ్‌కుమార్, కృత్రిమ అవయవ కేంద్రం సీనియర్ టెక్నీషియన్ సస్మితా, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సాయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దొరమామిడిలో ఎంతో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దిన కాన్వెంట్ మాష్టార్ (శాంతి విద్యానికేతన్) అనారోగ్యానికి గురయ్యారు. వారిని ఫ్రెండ్స్ ఫర్ హెల్ప్ గ్రూపు సభ్యులు గురువారం పరామర్శించి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులు మాట్లాడుతూ ఆయన మాస్టర్ దొరమామిడిలోని ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారని, ఆయన దగ్గర చదువుకున్న వారు ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రపంచంలో మనుషుల మధ్య ప్రేమను పంచడమే క్రైస్తవత్వం అని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ అన్నారు. స్థానిక ఏలూరు ఆర్‌సిఎం చర్చి ప్రాంగణంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంబేద్కర్ మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం క్రీస్తు సాగించిన జీవన పయనం ఆదర్శనీయమన్నారు. సభాధ్యక్షత వహించిన వేల్ల చింతలగూడెం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బివి.ప్రసాద్ మాట్లాడుతూ తోటి వారికి ప్రేమను పంచడం ఒక ఉద్యమంలా సాగించాలన్నారు. ఆర్‌సిఎం చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ కె.కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.స్లీవజోజి, ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్, నిర్మల సిస్టర్స్ సుపీరియర్ అమలరాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చాట్రాయి పెద్దపేట దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆహారం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో మురుగునీటి వ్యవస్థను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి, ఎఎన్ఎంలకు శానిటేషన్‌పై సూచనలు జారీ చేశారు. డ్రెయినేజీ సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించిన ఎంపిడిఒ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షేక్ నిషాకాలి, ఎఎన్ఎం సుజాత, ఆశావర్కర్లు వి.లక్ష్మీమాణిక్యం, కె.ప్రసన్న పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

మండలంలోని నత్తగుళ్లపాడు గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో కొంతమంది గాయాలపాలయ్యారు. గాయపడినవారిని మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, ఎంపిటిసి మాజీ సభ్యులు మేరిజ్యోతి, ఏడుకొండలు, నభగారి వంశీ, ఘంటసాల కృష్ణచంద్ గురువారం పరామర్శించారు.

సింగరాయపాలెంలో పారిశుధ్య పనులు

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం పంచాయతీలో గురువారం గ్రామ సర్పంచి బోయిన విమల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కార్మికులతో బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలోని కచ్చా డ్రెయిన్లలో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. పారిశుధ్య పనులను సర్పంచి విమల, పంచాయతీ కార్యదర్శి పివిఎన్.లక్ష్మి పర్యవేక్షించారు. ఆరోగ్య ఉపకేంద్రం వైద్య సిబ్బంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - టి.నరసాపురం

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ చింతలపూడి జోన్ కమిటీ ఆధ్వర్యంలో టి.నరసాపురం ఓం సాయిసూర్య యుపిస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఆటల పోటీలను శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి జోన్ కమిటీ కన్వీనర్ జెఎం క్సేవియర్ కార్యదర్శి కె.దిలీప్‌కుమార్, కోశాధికారి కె.పవన్‌కుమార్, జిల్లా నాయకులు బిఎన్.సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో రూ.85 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంఎల్ఎ ఎలిజా గురువారం ప్రారంభించారు. స్థానిక నాలుగో వార్డులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవి, ముప్పిడి వీరాంజనేయులు, వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తాతకుంట్ల రవికుమార్, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలోని తామరకొల్లులో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం ద్వారా మంజూరైన ట్రాక్టర్‌ను దూలం నాగేశ్వరరావు రైతుకు అందించారు. రైతులకు ఉపయుక్తంగా ఉండే విధంగా ట్రాక్టర్‌ను తీసుకున్న రైతు చిట్టేటి కేశవరాజు అభినందనీయు డన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భట్రాజు శివాజీ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వారి ఆధీనంలో ఉన్న ఎపివివిపి ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఆడియోమెట్రిషియన్, ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎవిఆర్.మోహన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు రూ.32670 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉద్యోగ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి లేదా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వారిని కార్యాలయ పనివి వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, మక్కినవారి గూడెం, మర్రిగూడెం గ్రామాల్లో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను, రాష్ట్ర పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి పాల్గొన్నారు.

ముదినేపల్లి : రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టిడిపికి మద్దతు పలకాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, దావు నాగరాజు, బి.సుందరరామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్యంపై ఆరా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కాయకల్ప ప్రోగ్రాం ఇంటర్నల్ ఎసెస్‌మెంట్‌లో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్యాన్ని వైద్య బృందం వారు గురువారం పరిశీలించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల తెలిపారు. కాయకల్ప ప్రోగ్రాం నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గురవారెడ్డి, డాక్టర్ వర్మ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో వార్డుల పరిశుభ్రత, పారిశుధ్యం, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.